కొనసాగుతున్న పది పరీక్షలు

మెదక్‌లోని పరీక్ష కేంద్రాన్ని సందర్శించిన కలెక్టర్ రాహుల్ రాజ్

వాహనాల తనిఖీని పరిశీలిస్తున్న కలెక్టర్ రాహుల్ రాజ్

- మూడో రోజు ఇంగ్లిష్
- పరీక్ష కేంద్రాన్ని సందర్శించిన కలెక్టర్

మెదక్ మున్సిపాలిటీ, మార్చి 21: మూడో రోజు గురువారం పదో తరగతి ఇంగ్లిష్ పరీక్ష సజావుగా ముగిసింది. జిల్లావ్యాప్తంగా 68 పరీక్ష కేంద్రాల్లో జరిగిన ఇంగ్లిష్ పరీక్షకు 10,298 మంది విద్యార్థులకు 10,278 మంది హాజరు కాగా, 20 మంది గైర్హాజరయ్యారని డీఈవో రాధాకిషన్ తెలిపారు. ప్రైవేట్ విద్యార్థులు 12 మందికి 11 మంది హాజరయ్యారన్నారు. జిల్లాలో విద్యార్థుల హాజరు 99.81 శాతంగా నమోదైనట్లు వివరించారు. జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ బాలుర పాఠశాల పరీక్ష కేంద్రాన్ని మెదక్ ఆర్డీవో రమాదేవి, తహసీల్దార్ శ్రీనివాస్‌తో కలిసి కలెక్టర్ రాహుల్‌రాజ్ సందర్శించారు. విద్యార్థులకు కల్పించిన సౌకర్యాలు, వసతులను పరిశీలించి, అధికారులకు పలు సూచనలు చేశారు. ఎండల తీవ్రత ఎక్కువగా ఉన్నందున తాగునీరు, ఓఆర్ఎస్ ప్యాకెట్లు అందుబాటులో ఉంచాలని సూచించారు. శివ్వంపేట, నర్సాపూర్, టేక్మాల్, పాపన్నపేట మండలాల్లోని 9 పరీక్ష కేంద్రాలను డీఈవో రాధాకిషన్ సందర్శించారు. అల్లాదుర్గం, పెద్దశంకరంపేట, చిన్నశంకరంపేట, నార్సింగి, చేగుంట మండ ల కేంద్రాల్లోని 15 పరీక్ష కేంద్రాలను ఫ్లయింగ్ స్క్వాడ్ బృందం తనిఖీలు చేసింది. జిల్లాలో ఎక్కడా డిబార్ లేదా మాల్‌ప్రాక్టీస్‌పై ఫిర్యాదులు రాలేదని డీఈవో రాధాకిషన్ పేర్కొన్నారు.

ప్రతి వాహనాన్ని తనిఖీ చేయాలి

పాపన్నపేట, మార్చి 21 : పార్లమెంట్ ఎన్నికల్లో నగదు, మద్యం పంపిణీ జరగకుండా ఎస్ఎస్‌టీ బృందాలు ప్రతి వాహనాన్ని కచ్చితంగా తనిఖీ చేయాలని కలెక్టర్ రాహుల్‌రాజ్ ఆదేశించారు. ఎన్నికల విధుల్లో భాగంగా పాపన్నపేట శివారులోని పోలీస్ చెక్ పోస్టును ఆర్డీవో రమాదేవితో కలిసి తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఎస్ఎస్‌టీ సభ్యులకు కలెక్టర్ పలు సూచనలు చేశారు. ప్రతి వాహనాన్ని తనిఖీ చేయాలని, సీసీకెమెరాల పర్యవేక్షణతోపాటు మెరుగైన పనితీరు కనబర్చాలని సూచించారు.

పోలింగ్ కేంద్రాల్లో వసతులు కల్పించాలి

పార్లమెంట్ ఎన్నికలు ప్రశాంత వాతావరణంలో నిర్వహించడానికి అన్ని చర్యలు తీసుకుంటున్నామని కలెక్టర్ రాహుల్ రాజ్ పేర్కొన్నారు. పాపన్నపేట మండలం డాక్యాతండాలో పోలింగ్ కేంద్రాలను అధికారులతో కలిసి కలెక్టర్ పరిశీలించారు. నూతనంగా ఏర్పాటు చేస్తున్న పోలింగ్ కేంద్రాల్లో మౌలిక వసతులు కల్పించాలని సూచించారు. కొత్తగా ఏర్పాటు చేసిన పోలింగ్ కేంద్రాలతో ఓటింగ్ శాతం పెరుగుతుందన్నారు. కలెక్టర్ వెంట తహసీల్దార్ లక్ష్మణ్ బాబు ఉన్నారు.

పాండురంగస్వామికి ప్రత్యేక పూజలు


రుక్మిణీపాండురంగస్వామికి ప్రత్యేక పూజలు చేస్తున్న ఎమ్మెల్యే సునీతాలక్ష్మారెడ్డి

- స్వామివారిని దర్శించుకున్న ఎమ్మెల్యే సునీతారెడ్డి
- మాజీ ఎమ్మెల్యేలు మదన్‌రెడ్డి, రఘునందన్‌రావు
- పీసీసీ ప్రధాన కార్యదర్శి రాజిరెడ్డి

వెల్దుర్తి, మార్చి 21 : మండలకేంద్రం మాసాయిపేటలో మరకతలింగ శివపంచాయతన రుక్మిణీపాండురంగస్వామి దేవాలయ 20వ వార్షికోత్సవాలు గురువారం వైభవంగా జరుగుతున్నాయి. వందలాది మంది భక్తుల నడుమ వేదపండితులు స్వస్తివాచనం, అఖండదీపస్థాపన, పురుషసూక్త, లక్ష్మీ సూక్త పారాయణాలు, మరకత శివలింగానికి మహాన్యాసపూర్వక రుద్రాభిషేకం, రుక్మిణీ పాండురంగస్వామి కల్యాణోత్సవాన్ని నిర్వహించారు. భక్తులకు తీర్థప్రసాదాలతో పాటు అన్నదానం ఏర్పాటు చేశారు. ఉత్సవాలకు ఎమ్మెల్యే సునీతాలక్ష్మారెడ్డి, మాజీ ఎమ్మెల్యేలు మదన్‌రెడ్డి, రఘునందన్‌రావు, రాష్ట్ర పీసీసీ ప్రధాన కార్యదర్శి ఆవుల రాజిరెడ్డి హాజరై ఆలయంలోని దేవతామూర్తులకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. దేవుడి కృపతో వర్షాలు సమృద్ధిగా కురిసి, పంటలు బాగా పండి ప్రజలు సుఖసంతోషాలతో ఉండాలని కోరుకున్నట్లు ఎమ్మెల్యే సునీతారెడ్డి తెలిపారు. వీరివెంట జడ్పీటీసీ రమేశ్‌గౌడ్, మాజీ సర్పంచ్ మధుసూదన్‌రెడ్డి, సొసైటీ డైరెక్టర్ నర్సింహులు, నాయకులు సిద్ధిరాములుగౌడ్, నాగరాజు, నర్సింహులు, శంకర్ ఉన్నారు.

పంటలకు సాగునీరు ఇవ్వాలి

- దుబ్బాక కాంగ్రెస్ ఇన్‌చార్జి చెరుకు శ్రీనివాస్‌రెడ్డి

సాగునీరు ఇవ్వాలని మాట్లాడుతున్న చెరుకు శ్రీనివాస్‌రెడ్డి

చేగుంట, మార్చి 21 : యాసంగి పంటలకు సరిపడా సాగునీటిని కాలువల ద్వారా అం దించాలని దుబ్బాక నియోజకవర్గం కాంగ్రెస్ ఇన్‌చార్జి చెరుకు శ్రీనివాస్‌రెడ్డి అధికారులకు సూచించారు. చేగుంట మండలం ఇబ్రహీంపూర్‌లో ఎండిన పంటలను గురువారం పరిశీలిం చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చేతికి వచ్చిన వరి పంటలు ఎండిపోతున్నాయని, కాలువ ద్వారా సాగునీరు ఇచ్చి, పంటలను కాపాడాలని అధికారులకు సూచించారు. ఈ మేరకు సాగునీటి పారుదలశాఖ అధికారులతో ఫోన్‌లో మాట్లాడారు. ఆయన వెంట కాంగ్రెస్ నాయకులు వడ్ల నవీన్‌కుమార్, సాబీర్, మాజీ సర్పంచ్‌రాములు ఉన్నారు.

పార్లమెంట్ ఎన్నికల్లో పోలింగ్ శాతాన్ని పెంచాలి

- మెదక్ జిల్లా అదనపు కలెక్టర్ వెంకటేశ్వర్లు

మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ వెంకటేశ్వర్లు, సదస్సులో పాల్గొన్న విద్యార్థులు

మెదక్ మున్సిపాలిటీ, మార్చి 21 : పార్లమెంట్ ఎన్నికల్లో పోలింగ్ శాతాన్ని పెంచి జిల్లాను ప్రథమస్థానంలో నిలపాలని అదనపు కలెక్టర్ వెంకటేశ్వర్లు అన్నారు. గురువారం జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో స్వీప్ ఆధ్వర్యంలో ఓటు ఆవశ్యకత, కొత్త ఓటరు నమోదుపై విద్యార్థులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సదస్సులో ఆయన మాట్లాడుతూ.. ఎన్నికల్లో పోలింగ్ శాతాన్ని పెంచి జిల్లాను రాష్ట్రంలోనే ప్రథమ స్థానం పొందేలా కృషి చేయాలన్నారు. 18 ఏండ్లు నిండిన ప్రతి ఒక్కరూ తప్పనిసరిగా ఓటరుగా పేరు నమోదు చేసుకోవాలని సూ చించారు. శాసనసభ ఎన్నికల్లో తొలిసారి ఓటు హక్కు పొందిన విద్యార్థులు ఉత్సాహం గా ఓటు వేశారని గుర్తు చేశారు. సదస్సులో స్వీప్ అధికారి రాజిరెడ్డి, ప్రిన్సిపాల్ హుస్సేన్, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

చెరువులో పడి గొర్రెలకాపరి మృతి

రాములు, గొర్లకాపరి

రామాయంపేట, మార్చి 21 : పొట్ట కూటికోసం జీవాలను తీసుకుని సుదూర ప్రాంతాలకు వలస వెళ్లిన వ్యక్తి ప్రమాదవశాత్తు చెరువులో పడి మృతి చెందాడు. కుటుంబీకులు తెలిపిన వివరాలు.. రామాయంపేట మండ లం తొనిగండ్ల గ్రామానికి చెందిన జంగంపల్లి రాములు (55) జీవాలను వెంటబెట్టుకుని మెదక్ జిల్లాలోని టేక్మాల్ మండలం బొడ్మట్‌పల్లి గ్రామానికి వెళ్లాడు. అక్కడ చెరువు ప్రాంతంలో గొర్రెలను మేపుతున్నాడు. గొర్రెలకు నీరు తాగించడానికి చెరువు గట్టుకు వెళ్లాడు. జీవాలు దప్పిక తీర్చుకుంటుండగా, రాములు సైతం కాళ్లు, చేతులు కడుకోవడానికి వెళ్లగా, ప్రమాదవశాత్తు కాలు జారడంతో నీటిలో పడి మృతి చెందాడు. రాములును రక్షించడానికి ఆయన వెంట ఉన్న ఇద్దరు వ్యక్తులు ప్రయత్నం చేశారు. సమాచారం తెలుసుకున్న టేక్మాల్ పోలీస్‌స్టేషన్ పోలీసు లు వెంటనే చెరువు వద్దకు చేరుకున్నారు. గజ ఈతగాళ్లు చెరువులో గాలించినా రాములు మృతదేహం దొరకలేదు. అనంతరం తొనిగండ్ల గ్రామంలో ఉంటున్న రాములు కుటుంబీకులకు సమాచారం అందజేశారు. గురువారం మృతదేహం చెరువులో తేలడంతో పోలీసులు పంచనామా నిర్వహించి, కేసు నమోదు చేశారు. రాములు మృతితో తొనిగండ్లలో విషాదం అలుముకున్నది. మృతుడికి భార్య మల్లవ్వ, కుమార్తెలు అనిత, సుమలత, కుమారుడు మధు ఉన్నారు.

వేసవిలో తాగునీటి సమస్య రావొద్దు

రేగోడ్, మార్చి 21 : వేసవిలో ప్రజలకు తాగునీటి సమస్య రాకుండా చర్యలు చేపట్టాలని అధికారులను ఎంపీడీవో సీతారావమ్మ ఆదేశించారు. గురువారం మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ సరోజనాసాయిలు అధ్యక్షతన సర్వసభ్య సమావేశం నిర్వహించారు. వేసవిలో ఆరోగ్య సంరక్షణకు తీసుకోవాల్సిన చర్యలను డాక్టర్ శ్వేత వివరించారు. గొర్రెల యూనిట్‌కు సొమ్ము చెల్లించినా ఇప్పటివరకు గొర్రెలు ఇవ్వలేదని, లబ్ధిదారులకు న్యాయం చేయాలని, లేకుంటే వారుఇచ్చిన నగదును తిరిగి చెల్లించాలని సూచించారు. సమావేశంలో వైస్ ఎంపీపీ వినీలావీరప్ప, ఎంపీటీసీలు నర్సింహులు, సంగీత, అధికారులు ఏవో జావీద్, ఏపీవో జగన్మోహన్ సింఘ్, విద్యుత్ ఏఈ యాసిన్, ఆర్ఐ ఫిరోజ్, సూపరింటెండెంట్ రమేశ్, సిబ్బంది శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీడీవో సీతారావమ్మ

మెదక్‌లో బీజేపీ జెండా ఎగురవేస్తాం

- ఎంపీ అభ్యర్థి రఘునందన్‌రావు
- మెదక్‌లో కార్యకర్తల సమావేశం


వెల్దుర్తిలో నిర్వహించిన ఎమ్మార్పీఎస్ సమావేశంలో మాట్లాడుతున్న మెదక్ పార్లమెంట్ బీజేపీ అభ్యర్థి రఘునందన్‌రావు

మెదక్, మార్చి 21 (నమస్తే తెలంగాణ) : టైగర్ నరేంద్ర తర్వాత మెదక్ పార్లమెంట్ నియోజకవర్గంలో కాషాయం జెండాను ఎగరవేస్తామని బీజేపీ అభ్యర్థి రఘునందన్‌రావు ధీమా వ్యక్తం చేశారు. గురువారం మెదక్ జిల్లా హవేళీ ఘనపూర్ మండలం కూచన్‌పల్లి గ్రామంలోని వేంకటేశ్వరస్వామి ఆలయంలో రఘునందన్‌రావు ప్రత్యేక పూజలు చేశారు. బీజేపీ జిల్లా అధ్యక్షుడు గడ్డం శ్రీనివాస్ ఆధ్వర్యంలో హవేళీఘనపూర్‌లోని ఫంక్షన్ హాల్‌లో బీజేపీ ముఖ్య కార్యకర్తలు, నాయకులతో సమావేశం నిర్వహించారు. రాష్ట్రంలోని 17 పార్లమెంట్ స్థానాలను బీజేపీ కైవసం చేసుకుంటుందని ధీమా వ్యక్తం చేశారు.

బీజేపీ విజయానికి కృషి చేయాలి

వెల్దుర్తి, మార్చి 21 : ఎమ్మార్పీఎస్ నాయకులు, కార్యకర్తలు సమిష్టిగా కృషి చేసి మెదక్ పార్లమెంట్ నియోజకవర్గంలో బీజేపీ అభ్యర్థిగా తనను గెలిపించాలని రఘునందన్‌రావు కోరారు. మెదక్ పార్లమెంట్ నియోజకవర్గ స్థాయి ఎమ్మార్పీఎస్ నాయకులు, కార్యకర్తల సమావేశం నిర్వహించారు. సమావేశంలో రఘునందన్‌రావు మాట్లాడుతూ.. అమలు కాని పథకాలతో గద్దెనెక్కిన కాంగ్రెస్ ఎన్నికల హామీలను విస్మరించిందన్నారు. అకాల వర్షాలతో పంటలు ధ్వంసమై రైతులు ఆందోళన చేస్తుంటే రాష్ట్ర ప్రభుత్వం స్పందించడం లేదని మండిపడ్డారు. సమావేశంలో ఎమ్మార్పీఎస్ నాయకుడు యాదగిరి పాల్గొన్నారు.

అర్హులకు పోస్టల్ బ్యాలెట్ ఇవ్వాలి

బీఎల్వోలకు ఫారాలు అందజేస్తున్న తహసీల్దార్ గియానిస్సాబేగం

చేగుంట, మార్చి 21 : గ్రామాల్లో అర్హులందరికీ పోస్టల్ బ్యాలెట్ ఇవ్వాలని బీఎల్వోలకు తహసీల్దార్ గియానిస్సాబేగం సూచించారు. ముఖ్యంగా నడువలేని స్థితిలో ఉన్న వృద్ధులు, దివ్యాంగులకు ఓటుహక్కు వినియోగించుకునే విధంగా ఫారం-12డీ (పోస్టల్ బ్యాలెట్) అందజేస్తున్నట్లు పేర్కొన్నారు. చేగుంటలోని తహసీల్ కార్యాలయంలో గురువారం మండల ఎన్నికల అధికారి గియానిస్సా బేగం ఆధ్వర్యంలో గురువారం బూత్ లెవల్ అధికారుల(బీఎల్వో)తో సమావేశం ఏర్పాటు చేశారు. ఎన్నికల సందర్భంగా నిర్వహించాల్సిన విధులపై బీఎల్వోలకు తహసీల్దార్ గియానిస్సాబేగం అవగాహన కల్పించారు. సమావేశంలో ఆర్ఐ నర్సింగ్‌యాదవ్, బీఎల్వోలు పాల్గొన్నారు.

మహిళలు పోషకాహారం తీసుకోవాలి

రామాయంపేట రూరల్: గర్భిణులకు సీమంతం చేస్తున్న అంగన్‌వాడీలు

రామాయంపేట రూరల్, మార్చి 21 : మహిళలు పోషక విలువలు ఉన్న ఆహారం తీసుకోవాలని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ జయంతి సూచించారు. రామాయంపేట మండలం తొనిగండ్ల, కోనాపూర్ గ్రామాల్లోని అంగన్‌వాడీ కేంద్రాల్లో గురువారం పోషణ్- పక్వాడ్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా గర్భిణులకు సీమంతాలు, చిన్నారులకు అన్నప్రాసన చేశారు. ఆయా కార్యక్రమాల్లో ఐసీడీఎస్ సూపర్‌వైజర్ జయంతి మాట్లాడుతూ.. అంగన్‌వాడీ కేంద్రాల్లో అందించే పోషకాహార పదార్థాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. ప్రతి రోజూ ఆరోగ్య జాగ్రత్తలు పాటిస్తూ.. పౌష్టికాహారం తీసుకోవాలని సూచించారు. మహిళలకు ఆరోగ్య పరీక్షలు చేశారు. కార్యక్రమం లో పంచాయతీ కార్యదర్శి మౌనిక, అంగన్‌వాడీ కార్యకర్తలు బాలమణి, సుమలత, రోజా, ఆశ కార్యకర్త మానస, గర్భిణులు, బాలింతలు పాల్గొన్నారు.

చిన్నశంకరంపేట: చందంపేటలో గర్భిణులకు సీమంతం చేస్తున్న అంగన్‌వాడీ టీచర్లు

చిన్నశంకరంపేటలో..

చిన్నశంకరంపేట, మార్చి 21: గర్భిణులు, బాలింతలు పోషక విలువలు ఉన్న ఆహారాన్ని తీసుకుంటూనే సంపూర్ణ ఆరోగ్యంగా ఉంటారని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ శివకుమారి తెలిపారు. గురువారం చందంపేట అంగన్‌వాడీ కేంద్రంలో గర్భిణులకు సీమంతం, చిన్నారులకు అన్నప్రాసన నిర్వహించారు. తల్లిబిడ్డా ఆరోగ్యంగా ఉండాలంటే తల్లి పోషకాహారాన్ని తీసుకోవాలని సూచించారు. కార్యక్ర మంలో అంగన్‌వాడీ టీచర్లు స్వప్న, జ్యోతి, భవాని పాల్గొన్నారు.

అనుమానాస్పద స్థితిలో వ్యక్తి మృతి

ఘటన స్థలం వద్ద ఆధారాలు సేకరిస్తున్న క్లూస్‌టీం ఇన్‌సెట్‌లో అరిగె కుమార్(ఫైల్)

వెల్దుర్తి, మార్చి 21 : అనుమానాస్పదస్థితిలో వ్యక్తి మృతి చెందిన ఘటన వెల్దుర్తి మండలం రామాయిపల్లిలో బుధవారం రాత్రి జరిగింది. వెల్దుర్తి ఎస్సై నవత తెలిపిన వివరాలు.. రామాయిపల్లికి చెందిన అరిగె కుమార్ (42) మంగళవారం నుంచి కనిపించకపోవడంతో కుటుంబ సభ్యులు పలు ప్రాంతాల్లో వెతికారు. ఈ క్రమంలో గ్రామంలోని వాటర్ ట్యాంకు సమీపంలో ఉన్న గుడిసెలో కుమార్ మృతి చెంది ఉన్నట్లు స్థానికులు మృతుడి అన్న శ్రీహరికి ఫోన్ చేసి చెప్పారు. శ్రీహరి వచ్చి చూడగా కుమార్ మృతి చెంది ఉండడం, శరీరంపై సరిగ్గా బట్టలు లేకపోవడం, తల, కాళ్లకు గాయాలు కనిపించాయి. కుమార్ మృతిపై అనుమానం వ్యక్తం చేస్తూ వెల్దుర్తి పోలీస్‌స్టేషన్‌లో శ్రీహరి ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు ఎస్సై నవత కేసు నమోదు చేసి, ఉన్నతాధికారులకు సమాచారం ఇచ్చారు. గురువారం ఉదయం మెదక్ నుంచి డాగ్ స్క్వాడ్, క్లూస్ టీం తెప్పించి, ఆధారాలు సేకరించారు. అనంతరం మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం మెదక్ ఏరియా దవాఖానకు తరలించారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై నవత తెలిపారు.

ప్రజారక్షణకు సహకరించాలి: తూప్రాన్ డీఎస్పీ

చిలిపిచెడ్ పోలీస్‌స్టేషన్‌లో రికార్డులను పరిశీలిస్తున్న తూప్రాన్ డీఎస్పీ వెంకట్‌రెడ్డి, నర్సాపూర్ సీఐ జాన్‌రెడ్డి

చిలిపిచెడ్, మార్చి 21 : మండలకేంద్రంలోని చిలిపిచెడ్ పోలీస్‌స్టేషన్‌ను తూప్రాన్ డీఎస్పీ వెంకట్‌రెడ్డి గురువారం సందర్శించారు. ఈ సందర్భంగా పోలీస్‌స్టేషన్‌లో రికార్డులతో పాటు కేసుల నమోదు వివరాలను ఎస్సై షేక్ మహబూబ్‌ను అడిగి తెలుసుకున్నారు. అనంతరం డీఎస్పీ మాట్లాడుతూ.. ప్రజారక్షణకు ప్రతిఒక్కరూ పోలీసులకు సహకరించాలన్నారు. గ్రామాల్లో నిఘా ఏర్పాటు చేసి, దొంగతనాలను అరికట్టాలని ఎస్సైని ఆదేశించారు. రోడ్డు ప్రమాదాలు జరుగకుండా రాత్రి సమయంలో పెట్రోలింగ్ చేయాలి, సమాచారం అందిన వెంటనే పోలీసులు ఘటనా స్థలానికి చేరుకోవాలని సూచించారు. డీఎస్పీ వెంట ఎస్సై షేక్ మహబుబ్, సీఐ జాన్‌రెడ్డి, సిబ్బంది ఉన్నారు.

'108' సిబ్బంది ప్రాణదాతలు

- జిల్లా మేనేజర్ జనార్దన్, ఈఎంఈ మహేశ్‌కుమార్

108 అంబులెన్స్‌లో రికార్డులను పరిశీలిస్తున్న జిల్లా అధికారులు

రామాయంపేట, మార్చి 21: ఆపద సమయాల్లో ప్రజలకు 108 సిబ్బంది అందుబాటులో ఉంటూ ప్రాణదాతలుగా నిలుస్తున్నారని ఉమ్మడి మెదక్ జిల్లా 108 ప్రోగ్రామ్ మేనేజర్ జనార్దన్, ఈఎంఈ మహేశ్‌కుమార్ అన్నారు. గురువారం రామాయంపేట ప్రభుత్వ దవాఖానలోని 108 వాహనాన్ని పరిశీలించి, రికార్డులు తనిఖీ చేశారు. 108 సిబ్బంది ప్రజలతో మమేకమై ఉండాలన్నారు. రాత్రి సమయాల్లో వచ్చే సమాచారానికి ప్రతిస్పందించాలని సూచించారు. కార్యక్రమంలో ఈఎంటీ స్వామి, పైలట్ ఆసిఫ్ ఉన్నారు.

పరిశ్రమలో ప్రమాదం..
గాయపడిన కార్మికుడు

జిన్నారం, మార్చి 21: మండలంలోని గడ్డపోతారం పారిశ్రామికవాడలో స్టాండర్డ్ గ్లాస్ పరిశ్రమలో గురువారం జరిగిన ప్రమాదంలో కార్మికుడికి తీవ్ర గాయాలయ్యాయి. అతడిని సూరారంలోని ప్రైవేటు దవాఖానకు తరలించారు. కంపెనీ యాజమాన్యం నిర్లక్ష్యం వల్లే ప్రమాదం జరిగిందని స్థానికులు ఆరోపించారు. ఎటువంటి సేఫ్టీ లేకుండా పరిశ్రమను నడిపిస్తున్నా సంబంధిత అధికారులు పట్టించుకోవడం లేదని కార్మికులు తెలిపారు. పరిశ్రమలో అంబులెన్స్ సౌకర్యం లేకపోవడంతో గాయపడిన కార్మికుడిని ఆటోలో దవాఖానకు తరలించడంపై కార్మికులు ఆగ్రహం వ్యక్తం చేశారు. అధికారులు పట్టించుకొని కార్మికుడు పాజిల్‌కు న్యాయం చేయాలని కోరుతున్నారు.

ఆలయ హుండీ లెక్కింపు

సిద్దిపేట టౌన్, మార్చి 22 : పట్టణంలోని సంతోషిమాత ఆలయ హుండీని దేవాదాయ ధర్మదాయ అధికారుల పర్యవేక్షణలో గురువారం లెక్కించారు. భక్తులు అమ్మవారికి 174 రోజుల్లో రూ.1.76 లక్షలు సమర్పించారు. కార్యక్రమంలో ఆలయ చైర్మన్ నవీన్‌కుమార్, ఈవో విశ్వనాథ్‌శర్మ, ధర్మకర్తలు కల్యాణి, సత్యంగౌడ్, మధుసూదన్‌శర్మ, సిబ్బంది శంకర్ పాల్గొన్నారు.

ఉచితంగా కంటి ఆపరేషన్లు

కొమురవెల్లి, మార్చి 21: లయన్స్ క్లబ్ హైదరాబాద్ ఎవరెస్టు, లయన్స్ క్లబ్ ఆఫ్ ఆమాగల్ ఆధ్వర్యంలో ఇటీవల ఐనాపూర్‌లో వైద్య శిబిరం నిర్వహించారు. చికిత్స అవసరం ఉన్న సుమారు 20 మందిని గురువారం హైదరాబాద్‌లోని ప్రైవేటు దవాఖానలో ఉచితంగా కంటి ఆపరేషన్లు చేయించారు. కార్యక్రమంలో లయన్స్‌క్లబ్ ప్రెసిడెంట్ అరవింద్‌కుమార్, సెక్రటరీ జిల్లా రవీందర్, ప్రతినిధులు పాల్గొన్నారు.

రైతులకు ఆర్థికసాయం చేయాలి

- మాజీ ఎమ్మెల్యే శశిధర్‌రెడ్డి

పాపన్నపేట, మార్చి 21: వారం రోజులుగా కురుస్తున్న వడగండ్ల వర్షాల కారణంగా పంట నష్టపోయిన రైతులకు ఎకరానికి రూ.15 వేల ఆర్థిక సాయం చేయాలని ప్రభుత్వానికి మెదక్ మాజీ ఎమ్మెల్యే శశిధర్‌రెడ్డి విజ్ఞప్తి చేశారు. పంట చేతికి వచ్చే సమయంలో పూర్తిగా దెబ్బతిన్నాయని తెలిపారు. అధికారులు పంట నష్టం పరిశీలించి, సమగ్ర నివేదిక ప్రభుత్వానికి అందజేయాలని ఆయన కోరారు.

పెద్దమ్మ జాతర పోస్టర్ ఆవిష్కరణ

పోస్టర్ ఆవిష్కరిస్తున్న ఆలయ కమిటీ

రామాయంపేట, మార్చి 21: రామాయంపేటలోని పెద్దమ్మ ఆలయ వార్షికోత్సవాలు ఈ నెల 28 నుంచి 30 వరకు నిర్వహిస్తున్నారు. గురువారం ఆలయంలో ఉత్సవాల వాల్‌పోస్టర్‌ను ఆలయ కమిటీ సభ్యులు ఆవిష్కరించారు. కార్యక్రమంలో కౌన్సిలర్ గంగాధర్, ముదిరాజ్ సంఘం అధ్యక్షుడు సిద్ధిరాములు, నాయకులు ఆర్.నరేశ్, బి.రమేశ్, నర్సింహులు, ఆనంద్, మల్లేశం, రమాకాంత్, జయరాజు, నరేశ్, గణేశ్, విరాట్, భాను, రాకేశ్, పవన్ పాల్గొన్నారు.

కాంగ్రెస్ గ్రామ కమిటీ ఎన్నిక


కొండాపూర్(బీ) కాంగ్రెస్ కమిటీ

చేగుంట, మార్చి 21: కొండాపూర్(బీ)లో కాంగ్రెస్ గ్రామ కమిటీ సమావేశాన్ని గురువారం నిర్వహించారు. కాంగ్రెస్ మండలాధ్యక్షుడు వడ్ల నవీన్‌కుమార్ ఆధ్వర్యంలో గ్రామ కమిటీని ఎన్నుకున్నారు. గ్రామ కమిటీ అధ్యక్షుడిగా బేగరి రమేశ్, ఉపాధ్యక్షుడిగా గోర్మిల శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శిగా చంద్రం, యువజన అధ్యక్షులుగా పాలిటి మహిపాల్, నర్సింహులు, మహిళా అధ్యక్షురాలిగా వడ్యారం ఉమారాని, సభ్యులుగా గౌరీ దయాకర్, నాగరాజు, నిరుడి స్వామిని ఎనుకున్నారు. కార్యక్రమంలో మాజీ ఎంపీటీసీ అల్లి అంజిరెడ్డి, నాయకులు మాసాయిపేట శ్రీనివాస్, మోహన్ నాయక్, రామస్వామి పాల్గొన్నారు.

సీఎంఆర్ఎఫ్ ఎల్వోసీ అందజేత

చెక్కు అందజేస్తున్న ఆవుల రాజిరెడ్డి

నర్సాపూర్, మార్చి 21: మండలంలోని ఇబ్రహీంబాద్ గ్రామానికి చెందిన పట్లోళ్ల కొండల్‌రెడ్డికి అత్యవసర చికిత్స నిమిత్తం సీఎం సహాయనిధి నుంచి రూ.2,10,000 మంజూరయ్యాయి. గురువారం బాధిత కుటుంబ సభ్యులకు సీఎంఆర్ఎఫ్ ఎల్వోసీ చెక్కును నర్సాపూర్ నియోజకవర్గ కాంగ్రెస్ ఇన్‌చార్జి ఆవుల రాజిరెడ్డి నర్సాపూర్‌లో అందజేశారు. కార్యక్రమంలో డీసీసీ జిల్లా అధ్యక్షుడు ఆంజనేయులుగౌడ్, నాయకులు సుహాసిని, మల్లేశం, అశోక్ తదితరులు పాల్గొన్నారు.

ఆటోడ్రైవర్ మృతి

సలీం, డ్రైవర్ (ఫైల్)

నిజాంపేట, మార్చి 21: అనారోగ్యంతో బాధపడుతూ ఆటోడ్రైవర్ మృతి చెందిన ఘటన మండలంలోని కల్వకుంటలో గురువారం జరిగింది. స్థానికులు తెలిపిన వివరాలు.. కల్వకుంటకు చెందిన ఆటోడ్రైవర్ సలీం(47) కొంత కాలంగా కాలేయ సంబంధ వ్యాధితో బాధపడుతున్నాడు. ఈ క్రమంలో మొదటగా సిద్దిపేట ప్రభుత్వ దవాఖాన, తర్వాత హైదరాబాద్ గాంధీ దవాఖానకు కుటుంబసభ్యులు తరలించారు. బుధవారం రాత్రి సలీం చికిత్స పొందుతూ ఆరోగ్య పరిస్థితి విషమించి మృతి చెందాడు. మృతుడికి భార్య, ఇద్దరు కుమారులు, కుమార్తె ఉన్నారు.

పరిహారం చెక్కు అందజేత

చిలిపిచెడ్, మార్చి 21 : మండలంలోని చండూర్ గ్రామానికి చెందిన యాదుల్లాకు చెందిన గేదె ఆరు నెలల క్రితం విద్యుత్ షాక్‌తో మృతి చెందింది. వెటర్నరీ అధికారులు స్పందించి బాధిత రైతుకు రూ.40వేల నష్ట పరిహారం చెక్కు మంజూ రు చేశారు. ఈ మేరకు గురువారం బీఆర్ ఎస్ నాయకుడు కిషన్‌రెడ్డి బాధిత రైతుకు చెక్కును అందజేశారు.పరిహారం అందజేసిన వెటర్నరీ, విద్యుత్‌శాఖ అధికారులకు రైతు యాదుల్లా కృతజ్ఞతలు తెలిపాడు.

చెక్కు అందజేస్తున్న కిషన్‌రెడ్డి